# సత్యవ్రతం - అంతరార్థం

వ్రత విధానం :-

కార్తీకమాసంలో శుక్లపక్షమందు శుద్ధ నవమి 'కృత యుగ-ప్రారంభ'దినం. అనగా కలియుగాంతమై "సత్యయుగం" ఆరంభమయ్యే పుణ్యదినం! దీనినే అక్షయ నవమి అని కూడా పిలుస్తారు! సత్యపురుషుని ఆవిర్భావ సమయం గాన, ఇది 'సత్యయుగ' - ప్రారంభకాలమని "భవిష్య పురాణం' తెలుపుతోంది. సత్య స్వరూపుడనగా 'సత్యనారాయణుడు!' మన ఆంధ్రదేశంలో అన్నవరం పుణ్యక్షేత్రమందు కోట్లాదిమంది తెలుగువారికి కొంగుబంగారంగా కోరిన వరాలనెల్లా సిద్ధింపచేసే దేవతా స్వరూపుడే శ్రీ సత్యనారాయణస్వామి!

ఆ సత్య నారాణస్వామిని ఎవరైనా, ఏకాలంలోనైనా తమ సంకల్పసిద్ధి కోసం వ్రతంతో ఉపాసించవచ్చును! దీనినే
"శ్రీ సత్యనారాయణ వ్రతం"గా మన తెలుగునాట ఇంటింటా మహోత్సాహంగా జరుపుకొంటున్నాం ! కాని దురదృష్టవశాత్తూ అతి పవిత్రమైన ఈ మహా వ్రతాన్ని ఏదో కోరికలుతీర్చే మొక్కుబడిగా ఈ కథను పురోహితులు సగానికి సగం మింగేసి ఎంత త్వరగా పూర్తి చెయ్యాలా అన్న దృష్టితో పారాయణ చెయ్యటం మనకి ప్రత్యక్షంగా కనిపిస్తోంది!

దీనికితోడు రోజుకు ఎన్ని సత్యనారాయణ వ్రతాలు చేయిస్తే అంత డబ్బూ, బియ్యం, అరటిపళ్ళూ లభిస్తాయన్న దృష్టితో కూడా చేస్తున్నారు! ఈ పవిత్రమైన మహా వ్రతం అంతరార్థమేమిటి? పూర్వపు ఋషులు ఈ వ్రతాన్ని ఎటువంటి సత్యభావంతో చేశారు? అందులో కొంచెమైనా మనం అర్థం చేసుకొని ఆ భావాన్ని మన మనస్సులో పాదుకొలిపి సత్య స్వరూపుడైన ఆ సత్యనారాయణుని శక్తిని మన ఆత్మతో అనుభవిద్దామన్న కోరిక వ్రతంచేసే భక్తులకు ఎంత తీవ్రంగా వున్నా యదార్థంగా అది, అనుభవంలో చాలామందికి లభించడంలేదు! కేవలం వ్యాపారదృష్టితోనే ఈ వ్రత కథ చదువుతున్నారు!

దీనికి ముఖ్య కారణం తెలుగులో సరైన "శ్రీ సత్యనారాయణ వ్రత - కథ" అందించే ఉత్తమమైన పుస్తకం లభ్యం కావడం లేదు! కాబట్టి ఇప్పుడు వ్రతం అంతరార్థం వ్రతాధిష్ఠాన దైవమైన శ్రీ సత్యనారాణస్వామిని ధ్యానించె విధానమూ, యధాతథంగా ఋషులు తెలిపినదానినే, పాఠకులకు అలానే అందించాలనే సంకల్పంతో ఈ చిన్న శ్రీ సత్యనారాయణ వ్రతం గ్రంథంను పూజాపుష్పంగా, భగవదర్పణగా సమర్పిస్తున్నాను!

వ్రతకాలం :-

ఈ వ్రతంను, ఎప్పుడైనా చేయవచ్చు! 'పర్వకాలా'ల్లో చేస్తే అది విశేషమైన ఫలం ఇస్తుంది. "పర్వకాలాల్లో" అంటే సూర్యుడు రాశిమారే సంక్రమణ దినం ('మేష సంక్రాంతి', 'వృశ్చిక సంక్రాంతి' వంటి) దినంలుగాని, పౌర్ణమి, ఏకాదశి తిథులయందుగాని, చేసిన అది విశేషఫలం ఇస్తుంది. దీనిని దేవాలయంలోగాని, పుణ్యక్షేత్రంలలోగాని, నదీ తీరానగాని, నదీ సాగర - సంగమంవద్ద గాని, లేక ఆవులను కట్టివేసే "గోశాల" యందుగాని, పూజాస్థలం ఏర్పాటుచేసి ఆ ప్రకారం గనక ఆచరిస్తే వెయ్యింతలుగా ఫలితంఇస్తుంది.

వ్రత విధానం :-

ఈ వ్రతం చేసే స్థలం పైన చెప్పిన వాటిలో ఆధ్యాత్మిక శక్తి కలిగిన ఏ పుణ్యస్థలమైనా గాని లేదా నూతనంగా నిర్మించిన తన స్వగృహంలోగాని, భక్తిశ్రద్ధలతో ఆచరించాలి. సర్వ సాధారణంగా పెండ్లికుమారుడు తను వివాహంచెసుకొన్న మరుసటి దినమే నూతన వధువుతోకూడి ఈ పవిత్రమైన "శ్రీ సత్యనారాయణ-వ్రతం"ను ఆచరించుడం మనం అనుభవంలో చూస్తున్నాం!

ఈ వ్రతం ప్రారంభించే తిథి, నక్షత్రంలు తన జన్మరాశి నుండి, జన్మ నక్షత్రంనుంచీ లాభస్థానమందు, శుభస్థానమందూ వుండాలి! వ్రత ప్రాభకాలం శుభలగ్నమై శుభగ్రహంలతో చూడబడుచున్న సమయం ఐతే అది మరింత శుభప్రదం! ఈ వ్రతం బంధుమిత్ర పరివారంతోగాని, వీలైనంత ఎక్కువమందిని అందులో తన హితం కొరువారిని పెద్దలనూ, సద్గురువులను, ఆప్తులను ఆహ్వానించి, గౌరవించి, కూర్చుండచేసి వారిని "సదస్యులు" (సభాసదులు)గా చేసి నమస్కరించి వారి ఆశీస్సులతో ప్రారంభించాలి!

## వ్రత మంటపం :-

ఈ 'సత్యనారాయణ వ్రతం' చేసే వేదికను ఆవు పేడతోనూ, నదీగర్భంలోని ఒండ్రుమట్టితోగాని లేదా పుట్టమన్నుతోగాని కలిపి సరికొత్త ఇటుకలతో మూడు వరుసలతో నిర్మాణం చేయవలెను! గోమయంతో అలికి పసుపు, కుంకుమలతో ముగ్గులు వేసి బియ్యపు పిండి, పసుపు, కుంకుమలతో తూర్పార ముగ్గులు పెట్టి, ఆ తరువాత పూజాద్రవ్యాలు సిద్ధం చేయవలెను!

## పూజా ద్రవ్యాలు :-

రాగి కలశంగాని, గుండ్రని వెండిచెంబు గాని, లేక పంచలోహ కలశంగాని, సన్నని మూతిగల గుండ్రని చెంబు శుభ్రంగాతోమి, చందనం, కుంకుమ పసుపులతో దానిని అలంకరించి ఆ కలశపాత్రలో కొద్దిగా గంగనీరూ, శుద్ధోదకం, నవరత్నంలుగాని, సువర్ణంలుగాని వేసి, దర్భలు వుంచి నీరుపోసి టెంకాయను పట్టువస్త్రంతో చుట్టి మావిండి ఆకులతో పేర్చి, కలశంపై పెట్టవలెను!

కొత్త పిడతా మూకుళ్లూ, నాలుగుదిక్కులా నీటితో నింపి 'పంచ-పల్లవంలు' - అనగా అయిదు రకాల పవిత్రమైన ఆకులు ఆ నీటిలో వుంచి అక్షతలు, నవధాన్యాలూ నారాయణమంత్రంతో వేసి అందులో సంప్రోక్షించవలెను! దీపారాధన, అరటిపండ్లు, పసుపు, కుంకుమ, చందనం, అక్షింతలు, కొత్తవస్త్రాలూ సిద్ధం చేసుకోవాలి! ఇవన్నీ శుభముహూర్తానికి ముందుగానే పురోహితునితో సహా సిద్ధంగా వుంచు కొనవలెను!

తాను శుచిగా తలంటు స్నానం చేసి తెల్లని పట్టువస్త్రం ధరించి, తూర్పు ముఖంగా లేక ఉత్తర ముఖంగా కూచుని, ఆచమనంచేసి ఓంకారంతో ప్రాణాయామం చేయవలెను!